# యమసందర్శనం

"వీరే యమధర్మరాజుగారు!" అన్నారు భటులు.

వెంటనే నేను ఆయనకు సాష్టాంగ దండప్రమాణం ఆచరించి లేచి "మహాత్మా, మిమ్మల్ని చూడటంవల్ల నా జన్మ ధన్యమయింది!" అన్నాను.

"అబ్బాయీ, నాదగ్గిర అంత కపటవినయం నటించనవసరంలేదు. మనలో మనం హృదయం విప్పి మాట్లాడుకోవచ్చును. అట్లా కూర్చో!" అంటూ ఆ న్యాయమూర్తి తన ఆసనం పక్కనే నన్ను కూర్చుండనియోగించాడు.

"అవునండీ, తమదర్శనం అతిదుర్లభమని వింటాను. నాకది ఇంతసులభంగా ఎట్లా లభ్యమయిందో, తమరు నామీద ఇంత పక్షపాతం వహించి ఇంత దయయెందుకు చూపుతున్నారో నేను అర్థంచేసుకోలేకుండా ఉన్నాను" అన్నాను.

"దానికి రెండు కారణాలున్నై. ఒకటి—నువ్వింకా అధి

కారరీత్యా నాశాసనంలోకి వచ్చినవాడివికావు; ప్రస్తుతం నువునాకు అతిథిమాత్రుడివి. రెండు—నువు రచయితవు, నన్నుగురించి నాలుగు మంచిముక్కలు రాయవసిలినవాడివి. మీారచయితలున్నారే, మహాచెడ్డవాళ్ళు. ఇతరప్రాణి కోటిమాదిరిగామాబోటిగాళ్ళమీాద భయభక్తులతో ఉండనే ఉండరు. మీారంతా మీా చక్రవర్తులనూ, ప్రతినిధులనూ, అమాత్యులనూ ఏమంత గౌరవిస్తున్నారు చెబుదూ!"

యముడంతవాడుకూడా ఇట్లామాట్లాడటం ఆశ్చర్యం వేసింది.

"నువ్వట్లా ఆశ్చర్యపడకు!" అన్నాడు యముడు నా అభిప్రాయం అర్థంచేసుకుని. "ఎవరూ నాయందు విశ్వసించకపోతే నేనిక్కడ ఎట్లాఉంటాననుకున్నావు? ఇక్కడికి వచ్చినజీవులుకూడా పరిమితకాలం ఉండటానికి కారణం అదే. ఆజీవులను గురించి భూలోకవాసులు సంపూర్ణంగా మరిచిపోగానే వారు అదృశ్యులైపోతారు. మీారంతా మరిచిపోకుండా ఉన్న మహాత్ములు—వ్యాస వసిష్ఠ విశ్వామిత్రాది ఋషులూ, ప్రహ్లాదాంబరీషాది భక్తులూ, రామకృష్ణ వివేకానంద హరనాథాది అవతార పురుషులూ, మనువులూ—అంతా ఇంకా ఇక్కడే ఉన్నారు. చూడరాదూ?" అంటూ ఆయన తన సభను అలంకరించిన వారికేసి చూపాడు.

సభాభవనంచుట్టూ కలయచూసి నేను ఆశ్చర్యపోయినాను. మొదట్లో అంతమంది అక్కడఉన్న సంగతే గమనించలేదు. అందరినీ గు ర్తించగలిగాను. ఇంకొకటికూడా

జరిగిందనుకుంటాను. నేను ఎవరికోసం వెతికితే వారల్లా కనిపించారు. ఎవరూ నామనసులో లేనప్పుడు అక్కడ ఎవరూ లేరేమో!

"కాని, అయ్యా! తమభటులు నాకు యమలోకమంతా చూపినపుడు నేను దొరలను గాని ఇతర పాశ్చాత్యులను గాని చూసినట్లు జ్ఞాపకం రావటంలేదే?" అన్నాను.

"నే చెబుతున్న దేమిటి? వాళ్ళంతా ఇక్కడే ఉన్నారు కాని వాళ్ళకు కావలసిన విధంగా కనిపిస్తుంది ఈలోకం. వాళ్ళకు నాపేరుగాని ఆఖరుకు నేనెట్లా ఉంటానో కూడా తెలియదు. అందాకా ఎందుకూ? ఇతర దొరలంతా హాయిగా బీరు తాగి ఆనందిస్తుంటే, డాంటే అనే ఆయన బియాట్రిస్ అనే దొరసాని కోసం సప్తాగ్నుల మధ్య తన్నుతాను బంధించుకుని బయటికి రాకుండా ఉన్నాడు. ఇంకా ఆయనకు బియాట్రిస్ దొరకనే లేదు.

"పాపం? ఎప్పటికన్నా దొరుకుతుందా?"

"ఇక ఒకటే దొరకటం! ఎప్పటికైనా ఆయనరాసిన గ్రంథం రూపుమాయాలి; అప్పటికి వదలుతుంది ఆయనకీ చెర."

"నిష్కారణంగా ఆయన్ను అట్లా బాధపెట్టటం మీ ధర్మానికి ఏమాత్రమూ వన్నెతీసుక రావటం లేదు." అన్నాను.

"ఇది మరీ బాగుంది! ఆబాధ ఆయన అహంకారాన్ని ఎట్లా ఉపశమింప జేస్తున్నదో, బాధపడటం ఆయనకెంత ఇష్టంగా ఉందో నీకు తెలుసునా ఏమిటి?" అన్నాడు

యమధర్మరాజు కుపితుడై.

"సరే పోనివ్వండి నాకెందుకు ?...వీరంతా ఎవరం షోయ్ ?"

ఒక పెద్దతూగుడి భీభత్సంగా రోదనాలు చేసుకొంటూ బొబ్బలు పెడుతూ అక్కడికి వచ్చింది. వారిని బల్లెలతో పొడుస్తూ, గదలతో మొత్తుతూ, కొరడాలతో కొడుతూ, తోస్తూ, మట్టెలాగుల వాళ్ళు, కోరలవాళ్లు భయంకరాకారులు వచ్చారు.

"వీరంతా పాపులు, మృతులు. వీరిని విచారణచేసి ఒక్కక్షణంలో పంపేస్తాను" అంటూ యముడు వారికేసి తిరిగాడు. అంతలోనే ఆయన స్వరూపంకూడా అమిత భయంకరంగా మారిపోయింది.

యమధర్మరాజు ఒక్కొక్కరినే విచారణ ప్రారంభించాడు. ఆవచ్చినవారంతా యముడంటే భయం కలవారే. అందరూ గజగజా వణికి పోతున్నారు. పాపం! వారిలోనిష్ఠపరులూ, దైవభక్తులూ, సనాతనులూఉన్నారు. మొదట వారినిచూసి ఆశ్చర్యపడ్డాను. కాని తరవాత యమధర్మరాజు చెప్పిన సూత్రం జ్ఞాపకం వచ్చింది. ఎంత మంచిగా జీవించినా నరకప్రాప్తి తప్పదని వారినమ్మకం. వారి నమ్మకం ప్రకారమే జరుగుతున్నది. ఆశ్చర్యమేమిటి ?

మృతులలో కొద్దిమంది సనాతనులూ సద్ధర్మపరులూ పోగా మిగిలిన వారంతా వారి విశ్వాసాలకు గురిఅయిన దౌర్భాగ్యులు. భయపడుతూ తప్పుచేసినవారు.

వారినిచూస్తే జాలివేసింది. హత్యలు చేసినందుకూ, రంకుతనాలు చేసినందుకూ, దొంగతనం చేసినందుకూ, మాంసభక్షణ చేసినందుకూ వారిని యముడు నిర్దాక్షిణ్యంగా శిక్షిస్తున్నాడు; వేలకువేల సంవత్సరాలు తప్తతైలమూ, నరకకూపాలూ, రంపపుకోతలూ విధిస్తున్నాడు.

నాకు ఒళ్ళు మండిపోయింది. నేను ఉద్రేకంతో లేచి, "యమధర్మరాజా, ఆగు!" అన్నాను.

అందరూ ఒక్కసారిగా నావంక చూశారు.

"నీకు న్యాయమనేది తెలుసునా? నేను సోషలిస్టును. ప్రొలిటేరియనులను నువిట్లా బాధపెడితే నేను సహించను, తెలిసిందా? నేను డబ్బును పంచాలనే తత్వంవాణ్ణి పాపాన్ని పంచు! డబ్బుకంటె పాపం ఉందా ఏమిటి?

"వాడు దొంగతనం చేశాడంటే ఆదొంగతనానికి సంపూర్ణంగా వాడే బాధ్యుడా? అట్లా వచ్చేట్టయితే ఏపనికి ఎవరిని సంపూర్ణంగా బాధ్యుణ్ణిచేస్తావో చెయ్యి, చూస్తాను. మారచయితలవంటి వాళ్ళనే ఎప్పుడు ఎవరి రచనలో ఏభాగం, తస్కరిస్తామో, మారచనకు మేం ఎంతవరకు బాధ్యులమో తెలీదే! పాపం, ఆభ్రష్టులు వారు చేసేకర్మకు ఉత్తరాధికారులా?... చూడు, నిన్నుగురించీ, నీవెధవలోకం గురించీ ఏం రాస్తానో!" అని అరిచాను.

ఒక్కసారిగా సభాభవనమంతా అల్లకల్లోలమై పోయింది. పెద్దగడ్డాల మహర్షులూ మనువులూ ఒక్కసారిగా లేచి, "చంపండి, నాస్తికుణ్ణి! బతికి ఉండగానే కుంభీపాకంలోతోసి తలుపులు బిగించండి! పట్టుకోండి! పోనివ్వ

కండి! పట్టుకోండి!" అని భయంకరంగా అరవసాగారు.

అందరూ నాకేసి చూస్తున్నారు—యముడుకూడా! ఆ మొహాలన్నీ భయంకరంగానే ఉన్నై. ఒక్క మొహంలో కూడా నామీద సానుభూతి లేదు

నాగుండె అవిసిపోయింది. ముచ్చెమటలు పోసినై. ఏంచేస్తున్నానో నాకే తెలియదు. కాలిబలంకొద్దీ పరిగెత్త సాగాను. మంచుగడ్డకన్న చల్లని చేతులు నన్ను పట్టుకో వస్తున్నై. వాటిస్పర్శ పాముస్పర్శకంటెకూడా కంపరం కలిగిస్తున్నది. ఇంకా వేగంగా—ఇంకా వేగంగా పరిగెత్తు తున్నాను!......

అంతా నిశ్శబ్దం. ఏచప్పుడూ లేదు. ఎవరూ లేరు. నా గుండె మామూలుగా పనిచేస్తున్నది. చుట్టూ కలయచూ శాను. అంతా నిరామయంగా ఉంది.

ఇంతలో ఎవరోనన్ను పేరుపెట్టి పిలిచారు.

"ఎవరు వారు?"

"నేనే! యముణ్ణి! నీకు సరిఅయిన ఆతిథ్యం ఇవ్వలేక పోయినందుకు చింతగాఉంది. తప్పు నీదే సుమా!"

"నాదా! నాదా తప్పు?" అంటూ ఆయన కోసం చుట్టూచూశాను. ఆయన ఎక్కడా కనబడలేదు. మాట మాత్రం ఎక్కణ్ణించి వస్తున్నదీ అంతుపట్టకుండా విని పిస్తున్నది.

"తప్పు నీదికాదా మరి? అతిథిగా వచ్చిన వాడివి ఊరికే ఎందుకుండ లేకపోయినావు?"

"ఆగడ్డాల వాళ్ళంతా నామీద ఎందుకు విరుచుకు

పడాలి ? నేను చెప్పింది రైటా ? వాళ్ళు చెప్పింది రైటా ?"

"వాళ్ళవిశ్వాసాలు రైటయి ఉండవచ్చుననే సంశయం నువ్వేమాత్రమో కలిగి ఉండకపోతే నిన్ను వారు భయపెట్టగలిగి ఉండరు!" అన్నాడు యముడు.

"ఆమాటమాత్రం అబద్ధం. వాళ్ళు చెప్పిందంతా అబద్ధమనీ, వాళ్ళకు న్యాయమనేది ఏమీ తెలియదనీ నాకు స్పష్టంగా తెలుసును. నేనన్నమాటలు అక్షరాలా నిజం. ఆవిషయం నావిశ్వాసం మారదు."

"ఇప్పుడదంతా నిజమే. ఆక్షణంలో నీకింత నిబ్బరం లేకపోయింది. అందుకనే నీలో అంత ఉద్రేకం కలిగింది. నీవిశ్వాసంలో నీకు విశ్వాసం చాలనప్పుడే ఉద్రేకం జతపరచవలసి వస్తుంది. నిజమైన సత్యానికి సమర్థింపు కావాలా?"

"సత్యాన్ని అవతలవాళ్లు తోసివేస్తున్నప్పుడు—"

"అదీకాకా—

"నేను మొదటనే చెప్పాను. నాలోకాన్ని గురించి నీకేటువంటి విశ్వాసాలుంటే అట్లాగే కనిపిస్తుందని. నేను అన్యాయం చేస్తున్నాననే నమ్మకం నీలో లేకపోతే నీకు అన్యాయం కనిపించి ఉండదు. నాలోకంలో అన్యాయం జరుగుతున్నదనే విశ్వాసం నీలో పైకిరాగానే నీన్యాయానికి నాలోకంలో స్థానంలేకపోయింది. నీన్యాయంలో నీకు విశ్వాసం ఉన్నంతసేపూ నీకు సరిఅయిన ఆతిథ్యమే జరిగింది. పోయివస్తాను ?"